ఆటలతో మానసిక వికాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్

కడప అగ్రికల్చర్ : ఆటలు మానసిక వికాసానికి, శరీరం ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఎంతో దోహదం చేస్తాయని కడప డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ పేర్కొన్నారు. గురువారం సహకార ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా రాయలసీమ జోన్ పరిధిలోని డీసీసీ బ్యాంకు ఉద్యోగులకు బ్యాంకు ఆవరణంలో వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను సీఈఓతో పాటు ఓఎస్‌డీ గుర్రప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలు మానసిక ఒత్తిడిని అధిగమించడానికి సహకరిస్తాయన్నారు. మొదటి రోజు క్రికెట్ పోటీలను రిమ్స్ వద్ద ఉన్న వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో నిర్వహించారు. కడప, కర్నూలు జట్టు, అనంతపురం, చిత్తూరు జట్టు తలపడ్డాయి. ఇందులో కడప జట్టుపై కర్నూలు, అనంతపురం జట్టుపై చిత్తూరు విజయం సాధించాయి.

మంచినీటి సరఫరా పరిశీలన

ప్రొద్దుటూరు : అమృత్ పథకం ద్వారా మైలవరం జలాశయం నుంచి ప్రొద్దుటూరుకు నిర్మించిన పైపులైన్ ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకులకు మంచినీటి సరఫరా టెస్టింగ్, ఫిల్లింగ్ పనులను గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి పరిశీలించారు. స్థానిక సంజీవనగర్‌లోని ట్యాంక్‌కు, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని ట్యాంక్‌కు టెస్టింగ్, ఫిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు శుద్ధినీటిని అందించి తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ సాయికృష్ణ, డీఈలు దస్తగిరి, దస్తగిరిరెడ్డి, వైఎస్సార్‌సీపీ 7వ వార్డు ఇన్‌చార్జి ప్రకాష్, గురునాథరెడ్డి పాల్గొన్నారు.

ఆ దంపతులు.. స్ఫూర్తి ప్రదాతలు

జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



అనాథ శవాన్ని మోస్తున్న రామకృష్ణారెడ్డి, రామతులసి, సంస్థ సభ్యులు.(ఫైల్)

పోరుమామిళ్ల : వారు యువతకు మార్గదర్శకులు, నిర్దేశకులు. వారు నిరంతర సేవా దీపికలు. వారు అన్నార్తులకు, అభాగ్యులకు, వృద్ధులకు ఆశ్రయం కల్పించి, అన్నం పెడుతున్న సేవామూర్తులు. వారు అనాథ శవాలకు ఆత్మబంధువులు. అయినవారు కాలదన్నినప్పుడు, ఆస్తులకే వారసులం, కన్నవారికి కాదన్నప్పుడు, వృద్ధాప్యంలో పట్టెడన్నం కోసం వీధిన పడి, గూడూ, నీడ లేక అల్లాడుతూ, ఎక్కడో కాలధర్మం చేసినవారికి అన్నీ తామే అయి అంతిమ సంస్కారం చేయడం వారి కర్తవ్యంగా నిర్వహిస్తున్నారు. అందరూ యువకులే.. ఎలాంటి అదురు బెదురు లేక ఎదురెళ్లి శవాన్ని భుజానకెత్తుకుంటున్నారు. అలాంటివారు ఉన్నందువల్లే సమాజంలో ఇంకా మంచితనం, మానవత్వం, సేవా తత్పరత బతికి ఉందనే విశ్వాసం వ్యక్తమవుతోంది.

స్వామి వివేకానంద స్ఫూర్తితో వివేకానంద ఫౌండేషన్ నెలకొల్పి, ఎన్నో స్ఫూర్తిదాయక సేవలతో తనతో కలసి వచ్చే యువకులను సంస్థలో భాగస్వాములను చేర్చుకున్నాడు పాపిజెన్ని రామకష్టారెడ్డి. పోరుమామిళ్లలో పాపిజెన్ని రామకష్టారెడ్డి అంటేనే సేవకు చిరునామా. 2010 జనవరి 12న సంస్థను స్థాపించిన రామకృష్ణారెడ్డి... రామతులసిని జీవిత భాగస్వామిగా చేసుకున్నాక ఆమెను కూడా సేవాకార్యక్రమాల్లో భాగస్వామిగా చేర్చుకున్నాడు. ఓబులాపురం- నరసాపురం మధ్య సగిలేరు ఒడ్డున సేవాశ్రమం ఏర్పాటు చేసి వృద్ధులు, అనాథలకు ఆశ్రయం కల్పించాడు.

ఆలోచన అలా మొదలయింది
– రామకృష్ణారెడ్డి

పోరుమామిళ్లలో డిగ్రీ చదివేటప్పుడే స్వామి వివేకానందుని గురించి తెలుసుకున్నాను. చదువుతో పాటు వివేకానంద సూక్తులు, ఆయన జీవితం గురించి యువతకు, విద్యార్థులకు ప్రచారం చేయడం మొదలు పెట్టాను. డిగ్రీ పూర్తయి రైల్వేలో ఉద్యోగం రావడంతో సేవా కార్యక్రమాలు విస్తృత పరిచాను. విద్యార్థులకు చెప్పులు, బ్యాగులు, పుస్తకాల పంపిణీ, పేదలకు అన్నదానం, అనాథలు, వృద్ధులు, భిక్షాటన చేసేవారికి చలికాలంలో దుప్పట్లు పంపిణీ ఇలా దాతల సహకారంతో అనేక కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా చేశాను.

ఆ సంఘటన కలచివేసింది..

పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండులో ఓ సాధువు మరణించగా కసువు, చెత్త తీసుకెళ్లే పంచాయతీ వాహనంలో ఆ శవాన్ని తీసుకెళ్లడాన్ని ప్రత్యక్షంగా చూసి మనసు కకావికలమయింది. వెంటనే శవాన్ని కిందికి దింపించి సాంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారాలు నిర్వహించి, శ్మశానానికి తీసుకెళ్లి పూడ్చాము. అప్పటి నుంచి నా భార్య రామతులసి, నా మిత్రుల సహకారంతో ఈ ప్రాంతంలో ఎక్కడ అనాథ శవం ఉన్నా మరుభూమికి తీసుకెళ్లి అంత్యక్రియలు చేస్తున్నాము. మా సేవలు గుర్తించిన దాతలు కొందరు శవాన్ని తీసుకెళ్లేందుకు ఓ వాహనం, ఓ ఫ్రీజర్ బాక్స్ అందజేశారు. దీంతో మాకు చాలావరకు వెసులుబాటు లభించింది. దాతల సహకారం, ప్రోత్సాహంతో వివేకానంద సేవాశ్రమం ఏర్పాటు చేశాము అని రామకృష్ణారెడ్డి తెలిపారు.



రామతులసి



రామకష్టారెడ్డి

మొదట్లో భయపడ్డా : రామతులసి

నాకు శవం అంటే భయం. నా బంధువులు మరణించినా చూసేందుకు పోయేదాన్ని కాదు. వివేకానంద ఫౌండేషన్ సేవాకార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. అయితే వివేకానంద సేవాశ్రమం నిర్వహించే సమయంలో కరోనాతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆయనకు అందరూ ఉన్నా దగ్గరకు పోయేందుకు ఎవరూ ముందుకు రాలేదు. అయినవారే శవాన్ని పట్టించుకోలేదు. ఆ పరిస్థితిలో నా భర్త రామకష్టారెడ్డి ఇచ్చిన ధైర్యంతో మేమే అంత్య క్రియలు నిర్వహించాం. అప్పటి నుంచి శవాలను మోయాలంటే భయం పోయింది. సమాజంలో ఎవరూ అనాథగా మరణించరాదు. యువతలో సేవాభావం పెరగాలి. ఒక్కొక్కరుగా ముందుకు రావాలి.

సమాజంలో మానవతా విలువలు పెంపొందించేందుకు చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నామని రామకృష్ణారెడ్డి తెలిపారు. మా సేవలు విస్తరించే ప్రయత్నం చేస్తున్నాం. ఎక్కడ ఎవరు మరణించినా ఆయా గ్రామస్తులు, పోలీసులు మాకు ఫోన్ చేస్తున్నారు. వెంటనే మేము వెళ్లి శవసంస్కారం చేస్తున్నాం.

ఇలాంటి అనేక సేవాకార్యక్రమాలతో అందరికీ మార్గదర్శకులుగా, స్ఫూర్తి ప్రదాతలుగా ఉన్న వారిని ఈ జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా మరొక సారి గుర్తు చేసుకుందాం.



సొంతిల్లు రావడం సంతోషంగా ఉంది



నేను పులివెందుల పట్టణం పార్నపల్లె రోడ్డులో ఉన్న రాజీవ్‌కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాను. గత ప్రభుత్వాల హయాంలో అనేకమార్లు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా ఇల్లు మంజూరు కాలేదు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే పేదల సంక్షేమం కోసం అర్హులైన వారికి జగనన్న కాలనీల పేరుతో ఊర్లను నిర్మిస్తున్నారు. అందులో నాకు ఇల్లు రావడం చాలా సంతోషంగా ఉంది. జగన్ బాబుకు ఎంతో రుణపడి ఉంటాం.

– గౌరి, రాజీవ్ కాలనీ, పులివెందుల

జగనన్న సురక్షతో ఉచితంగా సర్టిఫికెట్లు



గతంలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగేవాళ్లం. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్ మా ఇంటికి వచ్చి ఆధార్‌కార్డు, రేషన్ కార్డులు తీసుకెళ్లి ఉచితంగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను తయారు చేయించింది. మా గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు నాకు సర్టిఫికెట్లను అందజేశారు. ఆఫీసుల చుట్టూ తిరగకుండా సర్టిఫికెట్లు రావడం ఆనందంగా ఉంది.

– మందపల్లి రామయ్య, గాంధీవీధి, సిద్దవటం

పేద ప్రజల వైద్యానికి పెద్దపీట



చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల వైద్యానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్సీ ఆర్.రమేష్‌యాదవ్ పేర్కొన్నారు. స్థానిక శ్రీరాములపేటలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి మంజూరైన రూ.4.5 లక్షలను లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యసేవలు అందాలనే సదుద్దేశంతో ఆరోగ్యశ్రీ పరిమితని రూ.25 లక్షలకు పెంచారన్నారు.

ప్రతి కూలీకి పని కల్పించాలి

గోపవరం : ఉపాధి హామీ పథకం ద్వారా పని అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పించాలని డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన రూ.5 కోట్ల ఉపాధి పనులకు సంబంధించి 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల వారీగా జరిగిన పనులకు సోషల్ ఆడిట్ సిబ్బంది నివేదికలను చదివి వినిపించారు. సోషల్ ఆడిట్ సిబ్బంది ఇచ్చిన నివేదికల ప్రకారం మండల వ్యాప్తంగా చేపట్టిన పనుల్లో సుమారు రూ.30 వేలు రికవరీకి పీడీ ఆదేశించారు. సుపరిపాలన అంశాలైనటువంటి వర్క్ ఫైల్ నిర్వహణ, జాబ్‌కార్డులో ఎప్పటికప్పుడు పేర్లు నమోదు, పని ప్రదేశాల్లో నేమ్ బోర్డుల ఏర్పాటు చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని పీడీ హెచ్చరించారు. అనంతరం గోపవరంలో రైతులు సాగు చేసిన హార్టికల్చర్ ప్లాంటేషన్‌ను, రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ పనులను పరిశీలించారు. అనంతరం గోపవరం సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వివిధ అవసరాల కోసం సచివాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయినాయక్, ఏపీఓ విజయమ్మ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

దువ్వూరు : క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్ పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో క్రికెట్ ఫైనల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో దువ్వూరు, చింతకుంట జట్లు తలపడగా చింతకుంట జట్టు విజయం సాధించి నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. మండల కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, ఎంపీటీసీ ఖాదర్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకుడు లోమడ శేఖర్‌రెడ్డి, అంగడి రెహమాన్ పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రీడలు

గోపవరం : మండల స్థాయిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. రాచాయపేట, బ్రాహ్మణపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పోటీలను మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ, ఎంపీడీఓ సాయినాయక్‌లు పర్యవేక్షించారు. శుక్రవారంతో మండల స్థాయి క్రీడలు ముగియనున్నాయి. మండల స్థాయిలో విన్నర్‌గా ఎంపికైన టీంలకు నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. రాచాయపేటలో జరిగిన వాలీబాల్, కబడ్డీ, బాడ్మింటన్ పోటీల్లో రాచాయపేటకు చెందిన కబడ్డీ టీం మండల స్థాయి విన్నర్‌గా ఎంపికయ్యారు. బాడ్మింటన్‌లో బ్రాహ్మణపల్లె బాలికల టీం విన్నర్‌గా, వాలీబాల్‌లో రాచాయపేట టీం విన్నర్‌గా ఎంపికయ్యారు. వీరంతా నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్ పుల్లయ్య, మాజీ ఎంపీటీసీ సాంబశివారెడ్డి, గ్రామ పంచాయతీ డీడీఓలు విజయకుమార్, శ్రీనివాసులరెడ్డి, మోషే, నిఖిత, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బంది ధర్నా

ప్రొద్దుటూరు క్రైం : తమకు మూడు నెలలుగా కాంట్రాక్టర్ జీతాలు చెల్లించలేదని జిల్లా ఆస్పత్రిలోని శానిటేషన్ సిబ్బంది ధర్నాకు దిగారు. ఆస్పత్రిలోని మదర్ థెరిసా విగ్రహం వద్ద 70 మంది సిబ్బంది గురువారం ధర్నాలో కూర్చున్నారు. కాంట్రాక్టర్ మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని వారు ఆరోపించారు. చేతిలో చిల్లిగవ్వ కూడా లేకుండా సంక్రాంతి పండుగ ఎలా చేసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రి అధికారులు జోక్యం చేసుకొని తమకు వేతనాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో జిల్లాలోని నిరుద్యోగ యువతకు వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రీజినల్ కో ఆర్డినేటర్ సుబ్బారామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోలార్ టీవీ ఇన్‌స్టాలర్, సూర్యమిత్ర, సోషల్ మీడియా, ఎగ్జిక్యూటివ్ ఫ్రంట్ ఆఫీసు అసోసియేట్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్టు, ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్, రీటైల్ సేల్స్ అసోసియేట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, లైట్ మోటారు వెహికల్ డ్రైవర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 90630 82227 నంబరులో సంప్రదించాలన్నారు.

హెల్త్ కేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

నిరుద్యోగులకు కీట్స్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడ సమీపంలోని నందిగామలో హెల్త్‌కేర్ కౌన్సిలర్ కో ఆర్డినేటర్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. 19–30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 60 రోజులపాటు శిక్షణ ఉంటుందని, శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. వివరాలకు 90004 87423 నంబరులో సంప్రదించాలన్నారు.

అనుమతుల్లేని లేఅవుట్‌లలో
హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



చాపాడులో అనుమతి లేని లే అవుట్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన లే అవుట్‌లలో గురువారం కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏపీఓ కృష్ణసింగ్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. చాపాడులోని పోలీసు స్టేషన్ ఎదురుగా సర్వే నంబర్. 35, 60లలో 2 ఎకరాలు, పీహెచ్‌సీ వద్ద గల సర్వే నంబర్ 105లో 2.82 ఎకరాలు, నక్కలదిన్నె రోడ్డులో సర్వే నంబర్.64-2లో 2 ఎకరాలు, పాత గ్రామ పంచాయతీ భవనం వద్ద సర్వే నంబర్.41లో 1.50 ఎకరాలలో లే అవుట్‌లు ఏర్పాటు చేసిన భూయజమానులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామన్నారు. అయినా వారి నుంచి స్పందన లేదన్నారు. దీంతో అనుమతి లేని లే అవుట్‌లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. అనుమతులు లేని లేఅవుట్‌లలో ప్లాట్లు కొనడం, అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ జేపీఓ ఇందు, ప్లానింగ్ సెక్రటరీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి ధనుంజయబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రెట్టింపు పరిహారం

ఆర్డీఓ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

రాజుపాళెం : వేంపల్లె - చాగలమర్రి జాతీయ రహదారి భూ సేకరణకు సంబంధించి భూములు కోల్పోతున్న రైతులకు రిజిస్టర్ విలువ కన్నా రెట్టింపు పరిహారం చెల్లిస్తామని జమ్మలమడుగు ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. రాజుపాళెంలోని ఎంపీడీఓ సభా భవనంలో గురువారం భూములు కోల్పోతున్న రైతులతో నష్టపరిహార చెల్లింపులో అవార్డు విచారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గత మూడేళ్ల కాలానికి రిజిస్టర్ విలువలో సరాసరి ధరను లెక్కలోకి తీసుకుని ఆ విలువ కన్నా రెట్టింపు పరిహారం రైతులకు అందిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న రహదారికి ఇరువైపులా భూమిని కోల్పోతున్న రైతులకు, రోడ్డుకు దూరంగా ఉన్న పొలాలకు పరిహారం విషయంలో వ్యత్యాసం ఉంటుందన్నారు. ఆయా రెవెన్యూ పొలాలను బట్టి రిజిస్ట్రేషన్ విలువ మారుతూ ఉంటుందని, అందుకు అనుగుణంగానే ఈ పరిహారం అంచనా వేస్తామన్నారు. నూతనంగా ఏర్పాటు చేయబోయే జాతీయ రహదారి 1440కి భూమి కోల్పోతున్న రైతులకు పరిహారం విషయంలో న్యాయం జరిగేలా చూస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా జాతీయ రహదారిని నిర్మిస్తున్నట్లు ఆర్డీఓ చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ ఇందిరారాణి, నేషనల్ హైవే ఏఈ సురేంద్రారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సాయినాథరెడ్డి, మండల సర్వేయర్ గురుశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఆర్‌ఐ అశోక్ కుమార్, ఆయా గ్రామాల వీఆర్‌ఓలు, భూములు కోల్పోతున్న రైతులు పాల్గొన్నారు.


అగస్త్యేశ్వరునికి భస్మహారతి



అగస్త్యేశ్వరునికి భస్మహారతి ఇస్తున్న అర్చకుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా ప్రదోశకాలంలో ఉజ్జయిని మహాకాళేశ్వరునికి చేసే విధంగా ఘనంగా భస్మహారతి ఇచ్చారు. వేకువజామున అగస్త్యేశ్వరునికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి అగస్త్యేశ్వరుని మూలవిరాట్‌ను వేద పండితులు భస్మంతో అభిషేకించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి , ఈఓ శంకరబాలాజి పాల్గొన్నారు.

మధ్యంతర భృతిని ప్రకటించండి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నేత బాలజోజి

కలసపాడు : ఉద్యోగ, ఉపాధ్యాయుల మధ్యంతర భృతిని ప్రభుత్వం ప్రకటించాలని ఏపీటీఎఫ్ (257) జిల్లా ఉపాధ్యక్షులు ఇ.బాలజోజి అన్నారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో ఏపీటీఎఫ్ (257) కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 2023 నుంచి 12వ పీఆర్సీ అమలుకు ప్రభుత్వం కమిటీ వేయడం జరిగిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షన్‌దారులకు మధ్యంతర భృతి ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న సీఎఫ్, ఏపీజీఎల్‌ఐ రుణాలు, పీఆర్సీ బకాయిలు, సరెండర్ లీవ్‌లు, కరువు భత్యం బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.బాలఓబయ్య, ఆర్థిక కార్యదర్శి బి.ప్రభాకర్, కిరణ్ కుమార్, ప్రభాకర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, గురయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు ప్రతిపక్ష పార్టీల మాయలో పడొద్దు

వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం. జాషువా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

కడప కార్పొరేషన్ : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రతిపక్ష పార్టీల మాయలో పడొద్దని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం. జాషువా, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రాయల్ తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డిమాండ్ల సాధనకు ఆందోళన అవసరమేనని, ప్రభుత్వ పెద్దలను కించపరుస్తూ, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. సమ్మెలోకి రాజకీయాలు చొప్పించి లబ్ధిదారులకు నష్టం కలిగించడం సరికాదన్నారు. 2013 నుంచి అంగన్‌వాడీలకు పదోన్నతులు లేవని, గత ప్రభుత్వం అసలు పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్–2 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేసిందన్నారు. రూ. 16 కోట్ల ఖర్చుతో ఒక్కో అంగన్ వాడీ వర్కర్‌కు, హెల్పర్‌కు 6 చొప్పున యూనిఫాం చీరలు అందించారన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బండి మరియలు,శారద, మల్లీశ్వరి పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూప్‌కు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



ఏపీజీబీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులోని ఓ డ్వాక్రా గ్రూప్‌నకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆర్థికసాయం చేసి అండగా నిలిచారు. స్థానిక ఏపీజీబీ మెయిన్ బ్రాంచ్‌కు ఎమ్మెల్యే స్వయంగా వచ్చి లింగారెడ్డి కొట్టాలుకు చెందిన చందన స్వయం సహాయక సంఘానికి గురువారం రూ.1.80 లక్షలు చెల్లించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవమానం భరించలేక డ్వాక్రా లీడర్ శైలజ ఆత్మహత్య చేసుకుంటే మిగతా సభ్యులందరిని బ్యాంకు వారు ఇబ్బంది పెట్టడం సమంజసం కాదన్నారు. సుజన చౌదరి, విజయ్ మాల్యా లాంటి పెద్దలు, ధనవంతులు ఎంతో మంది బ్యాంకులకు రూ.కోట్లు ఎగ్గొడుతున్నారన్నారు. చందన గ్రూపునకు మొత్తం రూ.2.82లక్షలు బకాయి ఉండటంతో ఏపీజీబీ మెయిన్ బ్రాంచ్ అధికారులు గ్రూపు సభ్యులపై ఒత్తిడి పెంచారని, తిరిగి వారికి రుణం కూడా మంజూరు చేయలేదన్నారు. సమస్యను గ్రూపు సభ్యులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. బకాయి మొత్తంలో సగం డబ్బును తాను చెల్లించగా మిగతా డబ్బును సంఘ సభ్యులు చెల్లించారన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వెంకటసుబ్బమ్మ, సీసీ రత్నాకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

స్థానిక ఎక్సైజ్ అధికారుల తీరుపై ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని గాంధీ రోడ్డుకు చెందిన పల్లా పుల్లయ్య తన తల్లి పెద్ద కర్మ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం మద్యం షాపులోని బాటిళ్లను కొనుగోలు చేసి తీసుకెళుతుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకుని స్టేషన్‌కు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నేరుగా స్టేషన్‌కు వెళ్లారు. పల్లా పుల్లయ్య తన తల్లి డెత్ సర్టిఫికెట్ చూపించినా ఎక్సైజ్ అధికారులు ఒప్పుకోకుండా స్టేషన్‌కు తీసుకెళ్లడాన్ని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కేసుల పేరుతో సామాన్యులను వేధించడం ఏమిటన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీజీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, అరుణా నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనలకు ప్రతిరూపమే జగన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలకు ప్రతిరూపమే సీఎం వైఎస్ జగన్ అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. విజయవాడలో ఈనెల 19న ప్రభుత్వం 125 అడుగుల ఎత్తులో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక రాచమల్లు వారి రాజన్న భోజన శాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సమావేశానికి అరసం జిల్లా అధ్యక్షుడు నాగులారపు విజయసారథి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచమంతా పర్యటించారని, మనిషి జీవనానికి అవసరమైన రాజ్యాంగాన్ని తయారు చేశారన్నారు. అందుకోసమే రాజ్యాంగ నిర్మాత అయిన అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. రాజధాని నడిబొడ్డున విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దేశంలో ఎంతో మంది అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేశారని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విగ్రహానికి ప్రత్యేకత ఉందన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల వారికి అన్నింటిలో రిజర్వేషన్ విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈనెల 19న జరిగే కార్యక్రమానికి బస్సులు, రైళ్లలో వెళ్లాలా అన్న అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్, నాయకులు స్నూకర్ భాస్కర్, ఎమ్మార్పీఎస్ సుధాకర్, గడ్డం సురేష్, గాలిపోతుల సుదర్శన్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు మనోహర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బాలలక్ష్మయ్య, పల్లవోలు రత్నరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, రాజుపాళెం ఎంపీపీ సలోమి, ప్రొద్దుటూరు వైస్ ఎంపీపీ రెడ్డమ్మ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

మైదుకూరు : మైదుకూరు నియోకవర్గానికి చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.18.13 లక్షల సహాయాన్ని గురువారం సాయంత్రం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి లబ్ధిదారులకు అందించారు. మైదుకూరు మండలం గంజికుంటకు చెందిన వీరంరెడ్డి రామిరెడ్డికి రూ.1.70లక్షలు, మైదుకూరు పట్టణానికి చెందిన గుమ్మిడేల సుబ్బరత్నమ్మకు రూ.2.25 లక్షలు మంజూరైంది. అదే విధంగా దువ్వూరు మండలం చెంచుపల్లెకు చెందిన సానేపల్లె వెంకట కృష్ణారెడ్డికి రూ.5.50 లక్షలు, కృష్ణంపల్లెకు చెందిన పున్నం లక్ష్మీదేవికి రూ.2లక్షలు, ఏకోపల్లెకు చెందిన సుబ్బ దస్తగిరమ్మకు రూ.2లక్షలు, దువ్వూరు పట్టణానికి చెందిన యనమల బాల వెంకటసుబ్బయ్యకు రూ.70వేలు మంజూరైంది. వీరికి స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, మైదుకూరు మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, కోఆప్షన్ సభ్యుడు దండు సుబ్బయ్య, భరత్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

మైదుకూరులో ఈనెల 14వ తేదీ నుంచి జరిగే సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొనాలని శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి ఆలయ పాలకవర్గం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని ఆహ్వానించింది. సంక్రాంతి ఉత్సవాల ఆహ్వాన ప్రత్యేక సంచికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.



సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

నేడు వైద్య శిబిరం

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని సుములవారిపల్లె పంచాయతీ–3 పరిధిలో ఉన్న పెన్నానగర్‌లో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు కల్లూరు వైద్యాధికారి శివప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతున్న ప్రొద్దుటూరు

- సంక్రాంతి సందర్భంగా ఊపందుకున్న వ్యాపారాలు
- తెలుగు రాష్ట్రాల్లో బిజినెస్ సెంటర్‌గా ప్రొద్దుటూరుకు గుర్తింపు

ప్రొద్దుటూరు క్రైం : ఆంధ్రా, తెలంగాణాలోనే కాదు దక్షిణాది రాష్ట్రాల్లో వ్యాపార కేంద్రంగా ప్రొద్దుటూరుకు మంచి గుర్తింపు ఉంది. ఇక్కడ దొరకని వస్తువంటూ ఉండదు. నమ్మకమైన వ్యాపారానికి ప్రొద్దుటూరుకు పెట్టింది పేరు. మహానగరాలకు ధీటుగా ఇక్కడ వ్యాపారాలు జరుగుతున్నాయి. సిరిపురిగా విరాజిల్లుతున్న ప్రొద్దుటూరు బంగారు వ్యాపారంలో రెండో ముంబైగా, వస్త్ర వ్యాపారంలో తెలుగు రాష్ట్రాల్లోనే నంబర్ వన్ స్థానంలో కొనసాగుతోంది. వ్యాపార రంగంలో కొత్త పుంతలను తొక్కుతూ నవ్యతను సంతరించుకుంటోంది. స్వచ్ఛమైన బంగారు నగలను విక్రయించడం ఇక్కడి వ్యాపారుల ప్రత్యేకత. వస్త్ర వ్యాపారం కూడా ఇక్కడ పెద్ద ఎత్తున జరుగుతుంది. హోల్‌సేల్ క్లాత్‌మార్కెట్లలో అన్ని రకాల వస్త్రాలను విక్రయిస్తున్నారు. హోల్‌సేల్ షాపుల్లో ఇతర ప్రాంతాలకు కూడా ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తున్నారు. రెడీమేడ్ షాపులు, జెంట్స్‌వేర్‌లు ప్రొద్దుటూరులో అనేకం ఉన్నాయి. చీరెలు, మహిళలకు కావలసిన డ్రస్ మెటీరియల్స్, చుడీదార్లు, లాంగ్ ఫ్రాక్‌లు, ఫ్యాన్సీ టాప్‌లు విరివిరిగా స్థానిక దుకాణాల్లో విక్రయిస్తారు. ప్రొద్దుటూరు పట్టుచీరెలకు ప్రసిద్ధి చెందింది. పట్టుచీరెల కోసం దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. నగరాలకు ధీటుగా ప్రొద్దుటూరులో విలాసవంతమైన కల్యాణమండపాలు ఉన్నాయి. ఇతర ప్రాంతాలతో పోలిస్తే వీటి బాడుగలు కూడా తక్కువే అని చెప్పొచ్చు. మారుతున్న కాలానుగుణంగా ప్రొద్దుటూరులో లేడీస్ సెలూన్‌లు ఏర్పాటయ్యాయి. యువతులు, విద్యార్థినులు, మహిళల అభిరుచికి తగ్గట్టుగా సెలూన్‌లలో సేవలు అందిస్తున్నారు. జెంట్స్‌వేర్ షాపుల్లో ప్రముఖ కంపెనీల టీ షర్టులు, జీన్స్ ఫ్యాంట్‌లు, ఫార్మల్ షర్ట్‌లను విక్రయిస్తున్నారు. కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ఇక్కడి యాజమాన్యాలు తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. చికెన్ సెంటర్ల ద్వారా ప్రొద్దుటూరు పట్టణ ప్రజలకు తాజా చికెన్‌ను అందిస్తున్నారు. వైద్య రంగంలోనూ ప్రొద్దుటూరు రోజు రోజుకు అభివృద్ధి చెందుతోంది. కార్పొరేట్ వైద్యానికి ధీటుగా ఇక్కడి ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తున్నారు. వైద్యరంగంలో ఎంతో అనుభవం గడించిన వైద్యులు అనేక మంది ఉన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పసిడిపురిలో దినదినాభివృద్ధి చెందుతోంది. ప్రొద్దుటూరు పట్టణంలోనూ, శివారు ప్రాంతంలో అనేక విలాసవంతమైన వెంచెర్లు ఏర్పాటయ్యాయి. ప్రొద్దుటూరు అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది.



మహిళలతో కిటకిటలాడుతున్న రెడిమేడ్ వస్త్రదుకాణం

డీపీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా రవిశంకర్



బద్వేలు అర్బన్ : డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా బద్వేలు మున్సిపాలిటీ శీలంవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎం.రవిశంకర్ నియమితులయ్యారు. విజయవాడలో గురువారం జరిగిన ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ శ్రీను, ఎమ్మెల్సీ కల్పలత సమక్షంలో రవిశంకర్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు

అంగన్వాడీ వర్కర్ల నిరసన

చాపాడు : స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద గురువారం 31వ రోజు అంగన్వాడీ వర్కర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకూ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని యూనియన్ మండల అధ్యక్షురాలు సుజాత తెలిపారు.

సన్మానం



బొల్లు రామ్మోహన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీధ్వర్యంలో ఏలూరులో జరిగిన సాహిత్య సంక్రాంతి సంబరాలలో 'పండగొస్తుందోచ్' కవితా గానం చేసిన పోరుమామిళ్లకు చెందిన కవి బొల్లు రామ్మోహన్‌కు సన్మానం నిర్వహించారు. గురువారం ఏలూరు ఆలపాటి అనసూయమ్మ లలిత కళా నిలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రామ్మోహన్ కవితా గానం చేసినందుకు, తెలుగు సాహిత్యానికి ఆయన చేస్తున్న సేవకు సన్మానం చేశారు. తెలుగు సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, వేదిక చైర్మన్ డాక్టర్ ప్రతాప్, హైమావతి తదితరులు ప్రశంసాపత్రం, మెమెంటో ఇచ్చి సత్కరించారు.

నేడు వైద్య శిబిరం

దువ్వూరు : మండలంలోని చిన్నశింగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ సురేష్‌బాబు, వికసిత తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో ఉచితంగా మందులు పొందవచ్చునన్నారు.